కన్నులపండువగా భోగి

- భోగి మంటల వద్ద జన సందడి
- నేడు సంక్రాంతి సంబరాలు


భోగి వేడుకల్లో శాంతినగర్ వాసులు


వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో భోగి మంట వద్ద సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ శ్రేణులు

సీతంపేట: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పెద్ద పండగ సంక్రాంతి.. భోగి మంటల సందడితో శనివారం వేడుకగా ప్రారంభమైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే యువత ఉత్సాహంగా వాడవాడలా భోగిమంట లు వేశారు. నియోజకవర్గంలో వీధులన్నీ కళకళలాడాయి. చిన్నా పెద్దా అని తేడా లేకుండా కుటుంబ సమేతంగా అంతా భోగి మంటల వద్ద చేరి ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. ఇంట్లో పనికిరాని వస్తువులను మంటల్లో వేస్తూ తమ కష్టాలు, చెడును భోగి మంటలకు ఆహుతి చేస్తూ, భోగభాగ్యాలను ప్రసాదించాలని వేడుకున్నారు. రాజేంద్రనగర్‌లోని అపార్ట్‌మెంట్ల వాసులంతా కలిసి ఒకచోట భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నారులు చేయి చేయి పట్టుకొని భోగిమంటల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. సెల్ఫీలు దిగుతూ డ్యాన్సులు వేశారు. సీతంపేట రాధాకృష్ణ మందిరం, దుర్గాగణపతి ఆలయం వద్ద యూత్ భారీ ఎత్తున భోగిమంటలు వెలగించారు. సీతంపేట, గణేష్‌నగర్, రాజేంద్రనగర్, అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, శ్రీనివాసనగర్, లలితానగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో వేకువజాము నుంచి భోగి మంటల వెలుగులు విరజిల్లాయి. సాయంత్రం ముత్తయిదువలు చిన్నారులకు భోగిపల్లు పోసి నూరేళ్లు జీవించాలిన దీవించారు.

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు: కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భోగి పండగ ఘనంగా నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో కార్యాలయంలో పూజలు చేసి భోగి మంటలు వెలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆనందంగా పండగ చేసుకోవాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, జీవీఎంసీ కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, మాజీ కార్పొరేటర్లు బి.జగదీష్, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, డి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు నూకరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో సందడిగా..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లో సీనియర్ సిటిజన్ల ఆధ్వర్యంలో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి నేషనల్ పోర్ట్ ట్రస్టు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు వేడుకలను ప్రారంభించారు. పిల్లల నుంచి పెద్దల వరకు అంతా సందడి చేశారు. వియ్యపు సూర్యనారాయణ, లగుడు కృష్ణ, రొంగలి శ్రీను, షన్ముఖరావు, రవి, నాయుడు, వినయ్, తరుణ్, సింధు, శ్రావ్య, ఉష, రత్నశ్రీ పాల్గొన్నారు.

మురళీనగర్‌లో కోలాహలం

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో భోగి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మురళీనగర్, బిర్లా కూడలి సమీపంలోని గంగాగోదావరి అపార్ట్‌మెంట్ సముదాయంలో మహిళలు భోగి మంటలు వేసి ఆటపాటలతో సందడి చేశారు. మురళీనగర్‌లో మహిళలు వేసిన సంక్రాంతి ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి.


సీతంపేటలో భోగి మంట వెలుగులు


మురళీనగర్‌లో సంక్రాంతి ముగ్గు వద్ద మహిళల సందడి


గంగాగోదావరి అపార్ట్‌మెంట్‌లో భోగి మంటల వద్ద డ్యాన్స్ చేస్తున్న మహిళలు


లలితానగర్‌లో సంక్రాంతి ముగ్గు వేసి రంగులద్దుతున్న అమ్మాయిలు

వైభవుడి దర్శన భాగ్యం ఆనందకరం


సంప్రదాయ నృత్య బృందానికి వైభవుడి చిత్రపటాన్ని అందిస్తున్న కె.కె.రాజు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుతో కలిసి పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కె.కె.రాజుకు ఈవో బండారు ప్రసాద్, అర్చకులు వాసు, శేషు స్వాములు స్వాగతం పలికారు. ముందుగా వెంకన్నను దర్శించుకున్నారు. గోపూజ చేసి కె.కె.రాజు మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రతి ఇంటా ధనధాన్యాలు నింపాలని ఆకాంక్షించారు. స్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంక్రాంతి పాటలతో సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన వారికి ఆయన మెమొంటోలు, వైభవుడి చిత్రపటాలను బహూకరించారు.

ముగిసిన ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధారోత్సవాలు శనివారంతో ముగిశాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవిని ఒక పల్లకిలో, మధన గోపాలస్వామిని వేరొక పల్లకిలో అధిష్టంపజేశారు. తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై విశేషంగా స్నపనం నిర్వహించారు.

క్లుప్తంగా

అజ్మీర్‌లో ప్రత్యేక ప్రార్థనలు


అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న కె.వి.బాబా

సీతంపేట: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.వి.బాబా శనివారం రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాను తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్గాపై చాదర్, పుష్పాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 175కి 175 సీట్లు గెలుపొంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఉత్తర నియోజకవర్గం నుంచి కె.కె.రాజు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రార్థనలు చేసినట్టు కె.వి.బాబా తెలిపారు.

అపూర్వ కలయిక


ఉపాధ్యాయులతో జ్ఞాననికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ హైస్కూల్‌కు చెందిన 1996–1997 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఒక హోటల్‌లో సందడి చేశారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలు, చేసిన అల్లరి, ఉపాధ్యాయుల మమదలింపులు గుర్తుచేసుకుని మురిసిపోయారు. ఇపుడు ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారు.. పిల్లల సంగతులు తెలుసుకుని పరిచయం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఫొటోలు, సెల్ఫీలతో ఆనందంగా గడిపారు. వారి జీవితంలో మధుర జ్ఞాపకాలను ఇచ్చిన పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయలను కానుకగా స్కూల్ ప్రిన్సిపాల్ సునీతకు పూర్వ విద్యార్థులు అందజేశారు.

రైతుబజార్లలో సంక్రాంతి సరకులు

కంచరపాలెం: సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు తెలుగు వారి లోగిళ్లన్నీ బంధువులతో కళకళలాడుతాయి. మకర సంక్రాంతిలో పితృదేవతలకు మొక్కులు చెల్లించడమే ప్రధానం. ఇందుకోసం నైవేద్యంగా స్వయంపాకాన్ని పురోహితుడికి అందివ్వడం ఆనవాయితీ. ఈమేరకు పెద్దెత్తున కూరగాయలు అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని రైతుబజార్లలో కూరగాయలను సిద్ధం చేశారు. దేవ గుమ్మడి, చెరుకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలు, రోజు కనిపించే కూరగాయలు, ఆకుకూరలు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తెచ్చారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన దుంపలు, చెరుకు గడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కంచరపాలెం రైతుబజార్ శనివారం వినియోగదారులతో కళకళలాడింది. కూరగాయల విక్రయాలు జోరుగా సాగాయి.

రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్ల నుంచి పెయిరింగ్ రైళ్లు విశాఖకు ఆలస్యంగా రావడంతో రీషెడ్యూల్ చేశామన్నారు.

- శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- శనివారం రాత్రి 11.25 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 1 గంటకు బయలుదేరింది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు..

సికింద్రాబాద్ డివిజన్ సులేహల్లి స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా శనివారం మధ్య రాత్రి విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా వాడి, కాలాబురాగి, హోమ్నబాద్, బీదర్, వికారాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

బ్రేక్ డ్యాన్స్ నేషనల్ చాంపియన్‌గా చైతన్య

సీతంపేట: నేషనల్ లెవెల్ బ్రేక్ డ్యాన్స్ పోటీలో అక్కయ్యపాలేనికి చెందిన పెంటకోట చైతన్య అద్భుత ప్రతిభతో విన్నర్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ పోటీల్లో అండర్ 16 స్థాయిలో 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం నుంచి పాల్గొన్న చైతన్య మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను సాధించాడు. 2018లో మొదటి సారి పోటీల్లో అడుగుపెట్టిన చైతన్య ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నేషనల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. ఎంవీపీలోని డిస్నీ బ్రేకర్స్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ స్కూల్‌లో సోహైల్ సింగ్ వద్ద బ్రేకింగ్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు.


ధ్రువపత్రం అందుకుంటున్న చైతన్య

మరో సైబర్ క్రైం

- ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం: అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్ యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటుచేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. నగరంలోని ఆరిలోవకు చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేశాడు. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ ఉందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇది వరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. బాధితుడు కోడ్ నంబర్ ఎంటర్ చేయడంతో అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

అప్రమత్తంగా ఉండండి..

లోన్ యాప్ ఆగడాలు తగ్గినట్లు తగ్గి మళ్లీ విజృంభిస్తున్నందున ఎవరూ ఆన్‌లైన్ లోన్లు తీసుకోవద్దని సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ సూచించారు. సైబర్ నేరగాళ్లను నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930లో , సైబర్ క్రైం పోలీస్ స్టేషన్94906 17917 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

చూడముచ్చటైన ముగ్గులు


పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్

సీతంపేట: సంక్రాంతి పండగ సందర్భంగా గౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం జగన్నాథపురం మూడు గుళ్ల వద్ద శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని చూడముచ్చటైన రంగవల్లులు వేశారు. తెలుగు వారి పెద్ద పండగ సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా గొబ్బెమ్మలు, చెరకుగడలు, పాలకుండలతో ముగ్గులు అందంగా తీర్చిదిద్దారు. ప్రథమ స్థానంలో కాళ్ల శోభ, ద్వితీయ స్థానంలో బాసిని హేమలత, తృతీయ స్థానంలో బత్తుల శ్యామలదేవి గెలుపొందారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు. పాల్గొన్న మహిళలందరికీ చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, గౌరీ సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ మాలినాయుడు, కార్యదర్శి పారుపల్లి రవి, కోశాధికారి పిల్లా గోపి, టీడీపీ నాయకులు బొడ్డేటి మోహన్, సంఘ ప్రతినిధులు రాజగిరి సింహాచలం, ఎల్లంకి రామారావు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, రాజగిరి అప్పలరాజు, కె.శంకర నారాయణ, బొడ్డేడ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

శోభన్‌బాబుకు సేవా నివాళి

కంచరపాలెం: సమాజ సేవలో భాగస్వాములవుదామని సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సీనియర్ అభిమాని ఒమ్మి వెంకటరమణ పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రామ్మూర్తిపంతులుపేటలో దివంగత సినీ దిగ్గజం శోభన్‌బాబు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన కేక్ కట్‌చేసి మాట్లాడుతూ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో కూడిన కొత్త ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గువ్వల వెంకటరమణ యాదవ్, కొణతాల వెంకటరావు, కె.శోభనబాబు, జి.నాగరాజు, కిలాని అప్పలరాజు, కె.సత్యనారాయణ, బి.కుమార్, డి.విజయ్‌కుమార్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


శోభన్‌బాబుకు నివాళులర్పిస్తున్న అభిమానులు

ఏయూ సహకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం క్యాలెండర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు, సంస్థ స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రణాళిక చేయాలని సూచించారు. వర్సిటీ పరంగా సొసైటీ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఎ.పల్లవి, రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అంగరంగ వైభవంగా..


త్రిముఖ విఘ్నేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచయతన ఆలయంలో గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు యేడిద గురునాథ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణం జరిపారు. ధనుర్మాసం నెల రోజుల పాటు ఆలయంలో భక్తిశ్రద్ధలతో తిరుప్పావై పాడిన చిన్నారి కీర్తికి ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి పట్టు వస్త్రాలు బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాషరావు, బి.కె.నాయుడు, కృష్ణ, టి.వెంకటరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం

- ముగిసిన ధనుర్మాసోత్సవాలు


శ్రీనివాసనగర్ వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణం


లలితా పీఠంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట: నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు గోదారంగనాయకుల కల్యాణంతో ముగిశాయి. చివరి రోజైన భోగి పండగను పురస్కరించుకుని శనివారం వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం లలితా పీఠంలో గోదాదేవి, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించి పరిణయం జరిపించారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయంలో..

అక్కయ్యపాలెం: శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు నంబాళ వేంకట కూర్మాచార్యులు గోదాదేవి, రంగనాథుల కల్యాణం ఘనంగా జరిపించారు. భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు అందజేసింది. సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కంచరపాలెం ఆలయాల్లో ఘనంగా..

కంచరపాలెం: కంచరపాలెం శ్రీకృష్ణ సేవా సమాజం(యాదవ్), శ్రీరామా సేవా సమాజం యాదవ్ గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో సీతారామాలయం, శ్రీకృష్ణ మందిరంలో గోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ముగింపు పూజలు చేశారు. తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరాలయంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా జరిపారు. వరాహ లక్ష్మీనరసింహ స్వామి సేవ గరిడి సంఘం ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గరిడీ తాళాలు, కుంచు బెత్తులతో నృత్యాలు చేస్తూ వీధుల్లో పర్యటించారు. కంచరపాలెం ప్రాంతాల్లో తోడపెద్దును ఊరేగిస్తూ బియ్యం, పప్పు, నూనె తదితర సామగ్రిని సేకరించారు.


తిక్కవానిపాలెం వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణం చేస్తున్న అర్చకులు


అప్పయ్యనగర్ ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం చేస్తున్న అర్చకులు

శ్రీ, భూ సమేత వేంకటేశ్వరాలయంలో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ దరి అప్పయ్యనగర్‌లోని శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ధనుర్మాస వ్రతం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు నంబాల అప్పల నరసింహం, వేణుగోపాలాచార్యులు, శ్రీను, చంద్రమౌళి పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో.. : 50వ వార్డు మాధవధార కోదండ రామాలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కళింగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ బహుమతులు అందజేశారు.